'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

ఉద్యమ నాయకుల కార్ఖానా బీఆర్ఎస్

నూర శ్రీనివాస్

ప్రజా ఉద్యమం నాయకత్వాన్ని అన్వేషిస్తుంది. నాయకత్వం ఉద్యమాన్ని నిర్మిస్తుంది. ఈ రెండింటికీ పరస్పరపూరకమైన బంధాన్ని తెలంగాణ ఆవిష్కరించింది. దేశంలో తక్కిన రాజకీయ పార్టీలకు లేని ప్రత్యేకత బీఆర్ఎస్ పార్టీకి ఉన్నది. ప్రజా ఆకాంక్షల ఉద్యమాన్ని పార్లమెంటరీ రాజకీయాలకు అనుగుణమైన రీతిలో తీర్చిదిద్ది, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన పార్టీగా బీఆర్ఎస్‌కంటూ ఒక చరిత్ర ఉన్నది. ఇది ఎవరూ కాదనలేని సత్యం.

భారత స్వాతంత్రోద్యమానికి కాంగ్రెస్ పార్టీ నాయకత్వం వహించిందని ఎలా అంటున్నామో... , 1975లో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా సాగిన ఉద్యమం దేశానికి కొత్త నాయకత్వాన్ని జనించిందని ఎలా చెప్పుకుంటున్నామో.. అలాగే బీఆర్ఎస్ పార్టీ స్థాపన కొత్త నాయకత్వాన్ని ఉత్పత్తి చేసిందని కూడా చెప్పుకోవాలి. తెలంగాణ నేల మీద ఆ మాటకొస్తే ఉమ్మడి రాష్ట్రంలో రెండున్నర దశాబ్దాలుగా బీఆర్ఎస్ పార్టీ ప్రస్థావన తీయకుండా, కేసీఆర్ పేరు ఎత్తకుండా రాజకీయాలు చేయలేని వాతావరణం నెలకొన్నది. 2001 నుంచి ఇప్పటిదాకా ఆ పార్టీ గెలిచినా, ఓడినా... అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా... ఉద్యమంలో ఉన్నా, ఉద్యమం స్తబ్దుగా సాగినా.. ఏ దశలోనూ ఉమ్మడి రాష్ట్రంలో కేసీఆర్ పేరు లేకుండా రాజకీయాలు సాగని కాలమొకటి సృష్టించబడింది. అలా సృష్టించటం బీఆర్ఎస్‌కు ఒకవైపు అదృష్టం, మరోవైపు దురదృష్టం. అదృష్టం క్షేత్రస్థాయిలో చెక్కుచెదరని కేడర్ అయితే, దురదృష్టం ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులు ఇప్పుడు ఇతర పార్టీలకు మారటం.

తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్న క్రమంలో బీఆర్ఎస్ నుంచి గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. పార్టీని చీల్చటం ద్వారా ఉద్యమాన్ని నీరుగార్చవచ్చని 2004 ఎన్నికల్లో గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీ చేర్చుకున్నది. అవి కుట్రలని తెలంగాణ సమాజం అర్థం చేసుకున్నది. ఇప్పుడు జరుగుతున్న పరిణామాలనూ అదే కోణంలో తెలంగాణ విశ్లేషించుకుంటున్నది. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ ఉనికి లేకుండా చేసి తద్వారా తమకు అనుకూల రాజకీయాలు చేయటం సాధ్యమా? కాదా? కాలమే నిర్ణయిస్తుంది. అలా కాకుండా ఒక రాజకీయ పార్టీ స్పేస్‌ను మరో రాజకీయ పార్టీ భర్తీచేయాలనుకుంటే ఆ పార్టీ అనుసరించి, ఆచరించిన విశ్వాసాలను అచ్చుగుద్దినట్టు చేయాలి. అలా చేయటం సాధ్యమా? అంటే చరిత్ర అసాధ్యమనే చెప్తున్నది. కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీని ఒక ఎమోషన్‌తో నిర్మించారు. కేసీఆర్ ఉద్వేగాన్ని అద్ది ఉద్యమాన్ని ఎట్లా నిర్మించారో... పార్టీని కూడా అట్లాగే నిర్మించారని కేసీఆర్ బద్ధ విరోధులు సైతం అంగీకరించే సత్యం. కాబట్టి ఇవ్వాళ బీఆర్ఎస్‌ను వీడిన ప్రజాప్రతినిధులు, ఇంకా వీడాలనుకునేవాళ్లకు తెలంగాణతో కేసీఆర్‌కు ఉన్న ఉద్వేగాన్ని విడదీయలేరని, ఆ ఉద్వేగ నెత్తురు బీఆర్ఎస్‌లోనే ఉన్నదని వారి నిశ్చితాభిప్రాయం. కేసీఆర్ విరోధులు ఈ నిర్ణయానికి రావటానికి ప్రధాన కారణం బీఆర్ఎస్ ఉత్పత్తి చేసిన నాయకత్వం.

> **తెలంగాణ నవతరం నాయకత్వాన్ని ఉత్పత్తి చేసిన కర్మాగారంగా కేసీఆర్ బీఆర్ఎస్‌ను తీర్చిదిద్దారు. రాష్ట్ర సాధనే ధ్యేయంగా ఏర్పడిన బీఆర్ఎస్ రాష్ట్రాన్ని సాధించి, తెలంగాణ పునర్నిర్మాణంలో నవతరాన్ని భాగస్వామ్యం చేసింది. ఉద్యమ శక్తులనూ సమ్మిళితం చేసింది. తెలంగాణలో 60 లక్షల మంది సభ్యులున్న పార్టీ బీఆర్ఎస్.**

ఈ పార్టీ 'విద్యార్థి' శిక్షణా శిబిరాలు నిర్వహించి తెలంగాణ ఉద్యమానికి మెరికల్లాంటి నాయకులను ఉత్పత్తి చేసింది. 2001 నుంచి ఇప్పటిదాకా ఎదిగివచ్చిన ఎంతోమంది నాయకులు స్వరాష్ట్రంలో తమ బుద్ధికుశలతను ప్రదర్శించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, ఈటల రాజేందర్ (ప్రస్తుతం బీజేపీ ఎంపీ) వంటి ఎంతోమంది నాయకులు తమ తమ ప్రతిభాపాటవాలతో తెలంగాణ రాజకీయాలను సుసంపన్నం చేశారు. బాల్క సుమన్, గాదరి కిశోర్ వంటి విద్యార్థి నాయకులు ప్రజాప్రతినిధులుగా తమ ప్రాంతానికి వన్నె తెచ్చారు. ఉద్యమ మాగాణాన్ని తమ ఆటపాటలు, అక్షరసాగుతో అలరించిన గోరటి వెంకన్న, రసమయి బాలకిషన్, దేశపతి శ్రీనివాస్ వంటి వారనేకమందిని శాసననిర్మాణకర్తలుగా చేసిన ఘనత బీఆర్ఎస్‌ది. అప్పటిదాకా కొన్నివర్గాలకే రాజకీయ ప్రాతినిధ్యం కల్పించిన కాంగ్రెస్ పార్టీ వ్యూహాన్ని బద్దలు కొడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ఎన్టీ రామారావు టీడీపీ ద్వారా కొత్తతరం నాయత్వాన్ని రాజకీయాల్లోకి ఆహ్వానిస్తే.. అంతకు పది రెట్లు కేసీఆర్ మారుమూల పల్లెలు, పట్టణాల్లోని యువతను నాయకులుగా మలచి తెలంగాణ ప్రయోజనాల రక్షణ కవచంగా తీర్చిదిద్దారు. ఆ నాయకత్వమే నేడు తెలంగాణ రాజకీయాలను శాసిస్తున్నది. పార్లమెంట్ నుంచి పంచాయతీ దాకా ప్రజాభిమానాన్ని పార్టీ శ్రేణులు కంచుకోటగా కాపాడుకుంటారనే వాదన సజీవమైంది.

భాగోళిక, ఆర్థిక, సాంస్కృతిక, వారసత్వం, రాజకీయం సహా అన్నిరంగాల్లో అవగాహన ఉండేలా బీఆర్ఎస్ పార్టీ తనను తాను తీర్చిదిద్దుకున్నది. పంచాయతీ నుంచి పార్లమెంట్ దాకా అన్ని స్థాయిల్లో నాయకత్వం జెండా లెత్తింది. తెలంగాణ విషయంలో మిగతా పార్టీల నాయకుల వ్యవహార సరళికి, బీఆర్ఎస్ పార్టీ నాయకుల వ్యవహారశైలి భిన్నంగా ఉంటుందని అనేక సందర్భాలు రుజువు చేశాయి. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉమ్మడి రాష్ట్ర అసెంబ్లీలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు తమ వాదన పటిమతో సభను అబ్బురపరిచిన సందర్భాలనేకం. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఈటల సహా పలువురి నేతల విషయ జ్ఞానాన్ని చూసి ఆచార్య కొత్తపల్లి జయశంకర్ కీర్తించి ఆళింగనం చేసుకున్న సందర్భాలనేకం. రాష్ట్ర ఆవిర్భావ అనంతరం బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు ఇటు అసెంబ్లీ, అటు పార్లమెంట్ ఉభయ సభల్లోనే కాకుండా అనేక అంతర్జాతీయ వేదికలపై తెలంగాణ గౌరవాన్ని ఇనుమడింపజేశారు. రాజకీయ వారసత్వంగా లేని వేలాదిమంది కార్యకర్తలు నాయకులుగా ఎదిగిన పార్టీగా తక్కువ కాలంలోనే బీఆర్ఎస్ రికార్డు నెలకొల్పింది.

ఉస్మానియా, కాకతీయ, శాతవాహన, తెలంగాణ సహా వివిధ విశ్వవిద్యాలయాల కేంద్రంగా సాగిన ఉద్యమంలో విద్యార్థులు కీలక భూమికను పోషించారు. పార్టీ వ్యవస్థాపక సభ్యులుగా ఉన్న బోయిన పల్లి వినోద్‌కుమార్‌ను, విద్యార్థి నాయకుడు బాల్క సుమన్‌ను పార్లమెంట్‌కు పంపిన చరిత్ర బీఆర్ఎస్‌ది. తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించిన పసునూరి దయాకర్‌ను, తెలంగాణ జాగృతి ద్వారా తెలంగాణ సంస్కృతికి ప్రతీకలైన బతుకమ్మను ప్రపంచవ్యాప్తం చేసిన కల్వకుంట్ల కవితను పార్లమెంట్‌కు పంపిన రికార్డు బీఆర్ఎస్‌దే. ఫౌల్ట్రీ ఇండస్ట్రీలో ఉన్న రంజిత్ రెడ్డి (ఇప్పుడు కాంగ్రెస్‌లో), తాత వారసత్వాన్ని పుణికిపుచ్చుకోవాలనే స్ఫూర్తిని నింపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి (ప్రస్తుత బీజేపీ ఎంపీ), వైద్యుడిగా ఉండి ఉద్యమంలో పాల్గొన్న బూర నర్సయ్యగౌడ్, ఉద్యోగ సంఘాల నేతగా ఉన్న వెంకటేశ్ నేత, న్యాయవాది మధుసూదన్ రెడ్డి, జోగినపల్లి సంతోష్‌కుమార్, దీవకొండ దామోదర్ రావు, వద్దిరాజు రవిచంద్ర, పార్థసారథిరెడ్డి, బీబీ పాటిల్, ప్రొఫెసర్ సీతారాంనాయక్‌ను పార్లమెంట్‌కు పంపిందీ బీఆర్ఎస్సే.

> **ఉద్యమంలో తనతో నడిచిన బీఆర్ఎస్ నాయకులను, ఉద్యమకారులను, బుద్ధిజీవులను కేసీఆర్ తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వామ్యం చేశారు. ఇందులో బీఆర్ఎస్ పార్టీతోనే రాజకీయ రంగప్రవేశం చేసిన వారు, వివిధ ప్రజా ఉద్యమాలు, ఉద్యోగ ఉద్యమాలతో సంబంధం ఉన్నవారెందరికో కేసీఆర్ అవకాశాలు కల్పించారు.**

వారిలో మంత్రులుగా కేటీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్, కొప్పుల ఈశ్వర్, జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, పద్మారావుగౌడ్, నిరంజన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులుగా పెద్ది సుదర్శన్‌రెడ్డి, దాస్యం వినయ్‌భాస్కర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, గొంగిడి సునీత, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, గాదరి కిశోర్, రసమయి బాలకిషన్, చంటి క్రాంతికిరణ్, దుర్గం చిన్నయ్య, సుంకె రవిశంకర్, డాక్టర్ మెతుకు ఆనంద్, ఆరూరి రమేశ్, నోముల భగత్, డాక్టర్ సంజయ్, కోవా లక్ష్మి, బొడిగె శోభ, నల్లాల ఓదెలు, వేముల వీరేశం, నన్నపునేని నరేందర్, శంకర్‌నాయక్, సైదిరెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి ఇలా ఎంతోమంది గులాబీ సైనికులు చట్టసభల్లో తమ వాణిని వినిపించారు.

ఇక తెలంగాణ ఉద్యోగ సంఘాల నుంచి ఎదిగిన స్వామిగౌడ్ మండలి చైర్మన్‌గా, శ్రీనివాస్‌గౌడ్ మంత్రిగా పనిచేశారు. ఎమ్మెల్సీలుగా ఆర్.సత్యనారాయణ, నారదాసు లక్ష్మణ్‌రావు, గోరటి వెంకన్న, దేశపతి శ్రీనివాస్, సురభీ వాణిదేవి (పీవీ కుమార్తె), పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, నవీన్‌కుమార్, శంభీపూర్‌రాజు ఎమ్మెల్సీలుగా, గ్యాదరి బాలమల్లు, ఆంజనేయగౌడ్, రాజారాం యాదవ్, అమీర్, మీర్ ఇనాయత్ అలీ, మందుల సామేలు, నాగర్లు వెంకటేశ్వర్‌రావు, విప్లవ్‌కుమార్, మేడే రాజీవ్‌సాగర్, తాడూరి శ్రీనివాస్, పిడమర్తి రవి, ఎర్రోళ్ల శ్రీనివాస్, దేవీప్రసాద్, గాంధీనాయక్, వాల్యా నాయక్, శుభప్రద్ పటేల్, మఠం భిక్షపతి, మన్నె క్రిశాంక్, వాసుదేవరెడ్డి, జగన్మోహన్‌రావు, కిశోర్‌గౌడ్ ఇలా ఎంతోమంది రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్లుగా బీఆర్ఎస్ ఫ్యాక్టరీ నుంచి ఉత్పత్తి అయిన సైన్యమే. వీరితోపాటు జీహెచ్ఎంసీ మేయర్, డిప్యూటీ మేయర్లుగా బొంతు రామ్మోహన్, బాబా ఫసియొద్దీన్ సహా వేలాది మందిని స్థానిక సంస్థల ప్రతినిధులుగా ఎదిగేలా చేసిన మహావృక్షం బీఆర్ఎస్ పార్టీ. అలాగే ఇటీవల మరణించిన కుసుమ జగదీశ్, పాగాల సంపత్‌రెడ్డి సహా జడ్పీ చైర్మన్లుగా, నగరపాలక సంస్థ చైర్మన్లుగా, మున్సిపల్ చైర్మన్లుగా చాలామంది వ్యవహరించారు.

ఉద్యమకారులను అక్కున చేర్చుకోలేదు. అవకాశాలు ఇవ్వలేదు. పాలనలో భాగస్వామ్యం చేయలేదనే ఆరోపణ పూర్తిగా సత్యం కాదని పదేండ్ల కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ పాలన స్పష్టం చేస్తున్నది. తెలంగాణ ఉద్యమంలో తనతో మమేకమైన అనేకమంది మేధావులు, బుద్ధిజీవుల సేవలను కేసీఆర్ వినియోగించుకున్నారు. ఉద్యమ, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, మీడియా వర్గాల నుంచి ఎదిగివచ్చిన అనేకమంది వారి వారి అభిరుచులు, అనుభవాలకు అనుగుణంగా ఆయా రంగాల్లో సేవలందించారు. వారి సేవలకు బీఆర్ఎస్ పార్టీ తగిన గుర్తింపును, గౌరవాన్ని ఇవ్వటం తెలిసిందే. టీఎస్‌పీఎస్సీ తొలి చైర్మన్‌గా ఘంటా చక్రపాణి, బీసీ కమిన్ తొలి, మలి కమిషన్ చైర్మన్లుగా బీఎస్ రాములు, వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా అల్లం నారాయణ, సాహిత్య అకాడమీ చైర్మన్లుగా నందిని సిధారెడ్డి, జూలూరు గౌరీశంకర్, వి.ప్రకాశ్, అయాచితం శ్రీధర్, టంకశాల అశోక్, దేవులపల్లి ప్రభాకర్‌రావు, సమాచార శాఖ కమిషనర్లుగా బుద్దా మురళి, కట్టా శేఖర్‌రెడ్డి, నారాయణ్‌రెడ్డి సహా ఎంతోమంది బీఆర్ఎస్ సర్కార్‌లో భాగమయ్యారు.

ఉపసంహారం.. గతం గణకీర్తి అని చెప్పుకొని మురిసిపోతూ.. కప్పదాటు వర్తమానం అని మనసుకు సర్దిచెప్పుకోవటం కాకుండా క్షేత్రం నుంచి బలమైన పునాదిని నిర్మించుకోవలసి ఉన్నది. తెలంగాణ పేగు బంధాన్ని తిరిగి పునర్ నిర్వచించుకోవలసి ఉన్నది. తనను తాను తవ్వి తల్లి వేరును కనుగొనవలసి ఉన్నది.

కొలువు కొట్టేసి, నిరుద్యోగులను నెట్టేసి..

నరేష్ పాపట్ల
95054 75431

నిరుద్యోగుల పోరాట పునాదుల మీద ముఖ్యమంత్రి కొలువును కొట్టేసిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు అదే నిరుద్యోగుల కన్నీటి ఆవేదనను కనీసం అర్థం చేసుకోవడం లేదు. హైదరాబాద్ యూత్ డిక్లరేషన్‌లో ప్రకటించిన ఐదు అంశాలతో కూడిన 17 హామీల్లో ఇప్పటి వరకు ఒక్కటి కూడా నెరవేర్చలేదు. అంతేకాదు, అమావాస్య అర్ధరాత్రి ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలను చేర్చుకోవడమే కాకండా, ఏడు నెలల్లో సుమారు 17 సార్లు హస్తినకు వెళ్లిన రేవంత్‌కు.. నిరుద్యోగుల గోసను వినేందుకు కనీసం ఒక అరగంట సమయం లేకపోవడం శోచనీయం.

అధికారమే పరమావధిగా హైదరాబాద్ యూత్ డిక్లరేషన్‌ను ప్రకటించిన కాంగ్రెస్ రాష్ట్రంలో తొలిసారిగా అధికార పీఠమెక్కింది. ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన రేవంత్ నిరుద్యోగుల హామీలను ఆదిలోనే అటకెక్కించారు. 'ఏరు దాటిన తర్వాత తెప్ప తగలేసిన' చందంగా ప్రభుత్వం వ్యవహరిస్తుండటంతో నిరుద్యోగ యువత తీవ్ర ఆగ్రహానికి గురవుతున్నది. ఏడు నెలలుగా పాలకులు నిర్లక్ష్య పరీక్ష పెడుతుండటంతో.. పస్తులుంటూనే పుస్తకాలతో కుస్తీ పట్టే నిరుద్యోగులు రోడ్డెక్కి ఎర్రచీమల దండులా కదులుతున్నారు. వారి న్యాయమైన డిమాండ్లను పట్టించుకోకుంటే తేనెటీగలై ప్రభుత్వాన్ని చుట్టుముడతామని హెచ్చరిస్తున్నారు.

సరూర్‌నగర్‌లో గతేడాది మేలో జరిగిన సభలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ స్వయంగా హైదరాబాద్ యూత్ డిక్లరేషన్‌ను ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల భృతి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, తొలి, మలి ఉద్యమ అమరుల కుటుంబాలకు నెలకు రూ.25 వేలు పింఛన్, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, 18 ఏండ్లు నిండిన విద్యార్థినులకు ఉచితంగా ఎలక్ట్రిక్ స్కూటర్ల పంపిణీ వంటి హామీలను గుప్పించారు. ఆ తర్వాత నవంబర్‌లో అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఎవరూ ఊహించని విధంగా అశోక్‌నగర్‌లోని సిటీ సెంట్రల్ లైబ్రరీని సందర్శించి నిరుద్యోగులతో భేటీ అయ్యారు. 2 లక్షల ఉద్యోగాల భర్తీపై ఆయన కూడా బహిరంగంగా హామీ ఇచ్చారు. ఈ హామీలను సంపూర్ణంగా విశ్వసించిన నిరుద్యోగులు ప్రభుత్వ మార్పులో కీలక భూమిక పోషించారు. తీరా అధికారంలోకి వచ్చాక 'ప్రజా పాలన' అంటూ బీరాలు పలుకుతున్న ముఖ్యమంత్రి రేవంత్ వ్యవహారశైలిలో క్రమంగా 'మార్పు' కనిపిస్తున్నది. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఆయన అలసత్వం ప్రదర్శిస్తున్నారు. దాటవేత ధోరణితో యువతను మరోమారు దగా చేస్తున్నారు.

జాబ్ క్యాలెండర్ రూపకల్పనలో ఎందుకింత అలసత్వం? రెండు రోజుల వ్యవధిలో డీఎస్సీ అభ్యర్థులు గ్రూప్-2 పరీక్షను ఎలా రాయగలరు? ప్రభుత్వ పెద్దలు ఆలోచించాలి. రెండింటి మధ్య కనీసం రెండు నెలల సమయం ఉండాలన్న న్యాయమైన అభ్యర్థనను పట్టించుకోవడం లేదు. అంతేకాదు, గ్రూప్-2లో రెండు వేలు, గ్రూప్-3లో మూడు వేల పోస్టులు పెంచుతామని మాట ఇచ్చి, ఇప్పుడు మాట మార్చారు. జీవో 46 బాధితుల మెుర ఆలకించడం లేదు. గురుకుల అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసి మమః అనిపించేశారు. ఇప్పటి వరకు వారిని విధుల్లో చేర్చుకోలేదు. ఇవన్నీ పరిష్కారమయ్యే అంశాలే. కానీ, పక్కదోవ పట్టించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సాకులు చెప్తూ కాలయాపన చేస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రశ్నించే గొంతుకలు మూగబోయాయి. ప్రొఫెసర్ కోదండరాం రెడ్డి గడపదాటడం లేదు. విశ్రాంత ఐఏఎస్ ఆకునూరి మురళి స్వరంలో తీవ్రత తగ్గింది. నిరుద్యోగుల తరపున పోరాటం ముసుగులో ఫక్తు రాజకీయం చేసినవారు పదవులు రాగానే పెదవులు మూసుకున్నారు. ప్రస్తుతం వారి ముసుగు తొలగిపోయింది. నిజస్వరూపం బట్టబయలైంది.

పీడితవర్గాల తరపున పోరాడే ఓయూ విద్యార్థుల ఆత్మగౌరవం దెబ్బతీసేలా గతంలో రేవంత్ మాట్లాడినప్పుడే ఆయనను నిలువరించాల్సింది. అలా చేయకపోవడం వల్ల ఆయన ఇప్పుడు ఓయూ గడ్డపై పోలీసులతో కవాతు చేయిస్తున్నారు. అన్యాయాన్ని ఎదిరించిన వారిని నిర్బంధిస్తున్నారు. అరకొర వసతుల నడుమ.. అర్ధాకలితో అక్షర యుద్ధం చేస్తున్న నిరుద్యోగులను కించపరుస్తున్న అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇప్పటికైనా ఆత్మ విమర్శ చేసుకోవాలి.

> **నాడు మహిళలకు న్యాయం చేసే 'హిందూ కోడ్' బిల్లు విషయంలో జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ఏకంగా కేంద్ర మంత్రి పదవికి అంబేద్కర్ రాజీనామా చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు హామీని మరుగున పడేసే కుట్రలకు యూపీఏ ప్రభుత్వం తెరలేపినందుకు నిరసనగా నాడు కేంద్ర మంత్రి పదవికి కేసీఆర్ రాజీనామా చేశారు. కోట్లాది ప్రజల ఐదు దశాబ్దాల ఆకాంక్షకు అండగా నిలిచారు.**

ఆ సందర్భం ఈతరం కండ్లముందే చరిత్రగా నిలబడింది. తెలంగాణ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని నిరుద్యోగులు చేస్తున్న పోరాటం న్యాయమైనది. అందుకే బుద్ధిజీవులు, ఉద్యమకారులు, ప్రజా గొంతుకలు వారికి అండగా నిలవాలి.

మనీ పవర్‌కు, పీపుల్ పవర్‌కు మధ్య పోరు!

మహారాష్ట్రలో ఎమ్మెల్సీ ఎన్నికల పోరు మనీ పవర్‌కు, పీపుల్ పవర్‌కు మధ్య జరిగాయి. చిన్న పార్టీల ఎమ్మెల్యేలు, స్వతంత్ర ఎమ్మెల్యేల రేట్ స్టాక్‌మార్కెట్‌లా దూసుకుపోయింది. ఒక్కో ఎమ్మెల్యేకు రూ.20 కోట్ల నుంచి రూ.25 కోట్ల వరకు ముట్టజెప్పారు. కొంతమందికి రెండెకరాల భూమి కూడా ఇచ్చారు.

- సంజయ్‌రౌత్, శివసేన (యూబీటీ) నేత



ప్రపంచవ్యాప్తంగా కమ్యూనికేషన్ వ్యవస్థలో సెల్‌ఫోన్ల ఆగమనం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. దీనికి మన దేశమేమీ మినహాయింపు కాదు. సెల్‌ఫోన్లు అనేక ప్రయోజనాలను అందిస్తున్నప్పటికీ, బాల్యంపై పడుతున్న వాటి ప్రభావం ఆందోళన కలిగిస్తున్నది.

చరవాణి చెరలో బాల్యం

డాక్టర్ కొల్లు శ్రీనివాస్
80089 44045

ఫోన్లకు సంబంధించిన అతిపెద్ద మార్కెట్లలో మన దేశం కూడా ఒకటి. నానాటికి పెరుగుతున్న యువ జనాభా అందుకు కారణం. టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) ప్రకారం.. దేశంలో 2023 నాటికి 100 కోట్లకు పైగా ఫోన్ వినియోగదారులు ఉన్నారు. వీరిలో అత్యధికులు యువకులే. ఇంటర్నెట్, మొబైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐఏఎంఏఐ) 2022లో నిర్వహించిన సర్వే ప్రకారం.. దేశంలోని ఇంటర్నెట్ వినియోగదారుల్లో 40 శాతం మంది 12-29 ఏండ్ల మధ్య వయసున్నవారే. ఇది పిల్లలు, యుక్తవయస్కులలో మొబైల్ ఫోన్ల వాడకాన్ని నొక్కి చెప్తున్నది. నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (ఎన్‌సీపీసీఆర్) 2023 నాటి సర్వే ప్రకారం.. పద్దెనిమిది ఏండ్ల కంటే తక్కువ వయసున్న పాఠశాల పిల్లల్లో 42.9 శాతం మంది సోషల్ మీడియా ఖాతాలను కలిగి ఉన్నారు. 79 శాతం మంది రోజులో కనీసం రెండు గంటలు ఫోన్లలో గడుపుతున్నారు. అంతేకాదు, 62.6 శాతం మంది తమ తల్లిదండ్రుల ఫోన్లను ఉపయోగిస్తుండగా.. 30.2 శాతం మంది ఇంటర్నెట్ ఆధారిత సొంత ఫోన్లను ఉపయోగిస్తున్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్ వంటి మాధ్యమాల్లో చాటింగ్ చేయడానికి 52.9 శాతం మంది పిల్లలు స్మార్ట్‌ఫోన్ ఫీచర్లను ఉపయోగిస్తున్నారని సర్వేలో తేలింది.

సెల్‌ఫోన్ల వినియోగం అనేది ముఖ్యంగా విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. వివిధ అప్లికేషన్లు విద్యావనరులను అందుబాటులోకి తీసుకొచ్చాయి. అలాగే పట్టణ, గ్రామీణ విద్య మధ్య అంతరాన్ని తగ్గించాయి. మరీ ముఖ్యంగా కొవిడ్ సమయంలో అన్ని పాఠశాలలు, శిక్షణ కేంద్రాలు ఆన్‌లైన్ బోధనకు మారినందున ప్రతిఒక్కరికి ఫోన్ అనివార్యమైంది. 2021లో యూనిసెఫ్ జరిపిన ఒక అధ్యయనం ప్రకారం.. దేశంలోని 67 శాతం మంది పిల్లలు లాక్‌డౌన్ సమయంలో రిమోట్ లెర్నింగ్ కోసం మొబైల్ పరికరాలను ఉపయోగించారు.

విద్యాపరమైన ప్రయోజనాలు ఉన్నప్పటికీ ఫోన్‌ను అదే పనిగా వాడటం వల్ల పిల్లల్లో అనేక మానసిక సమస్యలు వస్తున్నాయి. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరోసైన్సెస్ 2020లో నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. సోషల్ మీడియా, గేమింగ్ యాప్‌లకు వ్యసనపరులు కావడమే ఈ మానసిక సమస్యలకు కారణం. కంటి అలసట, నిద్రలేమి లాంటి సమస్యలు సర్వసాధారణంగా మారాయి. శారీరక, మానసిక దుష్ప్రభావాలతో పాటు సామాజిక అభివృద్ధిని కూడా ఫోన్లు ప్రభావితం చేస్తున్నాయి. ఒంటరితనానికి అలవాటు పడి సామాజిక నైపుణ్యాలను కోల్పోతుండటం ఆందోళనకరం. ఈ తరహా మార్పులు భావితరాల అభివృద్ధికి నిరోదకంగా మారే ప్రమాదం లేకపోలేదు.

> **తల్లిదండ్రులు కూడా దీని గురించి ఆందోళన చెందుతున్నారు. కొంతమంది తల్లిదండ్రులు సమయపాలనకు సంబంధించి కొన్ని నిబంధనలు విధిస్తున్నప్పటికీ, వాటిని అమలు చేయడం సవాలుగా మారుతున్నది. చాలామంది ఆన్‌లైన్‌లో అభ్యసనం మాటున అశ్లీలం వీక్షించి, బంగారు భవితకు ఆదిలోనే సమాధి చేసుకుంటున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నది.**

ఈ వ్యసనానికి అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు సమాజంపై ఉన్నది. అందుకు పెద్దల పర్యవేక్షణలో రోజూ 2 గంటలకు మించి ఫోన్లు వాడకుండా చూడాలి. దాంతో పాటు పిల్లలు ఆటలో నిమగ్నమయ్యేలా చేయడం ద్వారా వారిని యాంత్రిక జీవన విధానం నుంచి బయటకు తీసుకురావచ్చు. ఆటల ద్వారా వారిలో మానసికోల్లాసాన్ని కలిగించవచ్చు.

సవాల్‌గా మారుతున్న ఈ సమస్యను పరిష్కరించడానికి తల్లిదండ్రులు, విద్యావేత్తలు, ఆరోగ్య సంరక్షణ నిపుణులు, విధాన రూపకర్తలతో కూడిన బహుముఖ విధానం అవసరం. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమతుల్యంగా, బాధ్యతాయుతంగా ఉపయోగించడాన్ని ప్రోత్సహించడం ద్వారా పిల్లల అభ్యున్నతిపై ప్రతికూల ప్రభావాలను తగ్గించవచ్చు. డిజిటల్ యుగంలో అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడటంతో పాటు యువ జనాభా ఆరోగ్యం, శ్రేయస్సు, సమగ్రాభివృద్ధికి ప్రాధాన్యం